క్లుప్తంగా

ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



మంగళగిరి: ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రమాదం తప్పిన ఘటన సోమవారం నగరంలోని ఎయిమ్స్ ఆసుపత్రి రోడ్డులో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి నుంచి రోగులను, వారి బంధువులను ఆటోలో ఎక్కించుకున్న డ్రైవర్ ఎయిమ్స్ ఆసుపత్రికి బయలు దేరాడు. మార్గం మధ్యలోని ఏకోపార్క్ ప్రవేశ ద్వారం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఆటో వెనుక చక్రం ఊడిపోయింది. ఆటో ఓ పక్కకు ఒరిగిపోయి కొద్ది దూరం దూసుకుపోయింది. ఆటోలో ఉన్న రోగులు, వారి బంధువులు ఆందోళన చెందారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆటోను నిలిపివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వారు తిరిగి వేరే ఆటోలో ఎక్కి ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు.

నిర్మల ఫార్మసీ కళాశాలకు ఆలిండియా 83వ ర్యాంక్


మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలకు ఆలిండియా నేషనల్ ఇనిస్ట్యూషనల్ ర్యాకింగ్ ఫ్రేమ్ (ఎన్ఐఆర్ఎఫ్)-2023లో 83వ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ రెహ్మాన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ర్యాంకును జాతీయ మానవ వనరుల అభివృద్ధి శాఖ విడుదల చేసినట్లు తెలిపారు. కళాశాలలోని అడ్మిషన్స్, పరిశోధనాపత్రాలు, పేటెంట్స్, ప్లేస్‌మెంట్స్, ప్రభుత్వం నుంచి లభించిన పరిశోధనా గ్రాంట్లు, అధ్యాపకులు, కళాశాలలోని మౌలిక వసతి సదుపాయాలు మొదలైన అంశాలు కారణమని కళాశాల సెక్రటరీ సిస్టర్ జి నిర్మల జ్యోతి తెలిపారు. ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల ప్రావెన్షియల్ సుపీరియర్ సిస్టర్ యు శౌరీలు అభినందనలు తెలిపారు.

ఇంటింటికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో అతిసార నియంత్రణ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు పంపిణీచేశారు. ఆయా గ్రామాల్లోని సబ్‌సెంటర్లలో చిన్నారుల తల్లులకు నీళ్ల విరేచనాలు నియంత్రణ గురించి వివరించారు. చిన్నారులకు నీళ్ల విరేచనాలు అవుతున్నప్పుడు ఇంటిలో లభించే నిమ్మరసం, గంజి, మజ్జిగ, కొబ్బరినీరు, పప్పుపై ఉండే తేటను పిల్లలకు అందజేయడం ద్వారా విరేచనాలు తగ్గడమే కాకుండా నీరసం లేకుండా ఉంటుందని తెలిపారు. ఇంటిలోనే ఓఆర్ఎస్ కలుపుకునే విధానం గురించి తెలియజేశారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింకు ఔషధం అందుబాటులో ఉంటుందని వివరించారు.

గణేషుని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేషునిపాడు గ్రామంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. ఇటీవల గణేషునిపాడు గ్రామ శివారులో కొండపై కొండవీటి రెడ్డిరాజుల కాలంనాటి ఆస్థాన విద్వాంసుడు శ్రీనిధునిచే పూజించబడిన గణేషుని విగ్రహాన్ని గుర్తుతెలియని దుండుగుల చేత ధ్వంసం కావడంతో అదే ప్రదేశంలో కొత్త పాలెం, గణేషునిపాడు గ్రామస్తుల సహకారంతో నూతనంగా గణేషుని విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు. మూడురోజులపాటు ప్రతిష్ట కార్యక్రమ పూజలు నిర్వహించనున్నారు. ఉదయాన్నే యాగశాలలో వేదపండితులు పలు రకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం యంత్రపూజలు నిర్వహించి నీరాజనం, మంత్రపుష్పం అందజేశారు. కార్యక్రమాలను వేద పండితులు నారాయణప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు పర్యవేక్షించారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయంతో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం రాత్రి వైఎస్సార్ సెంటర్‌లో తోపుడు బండ్లు, రిక్షా బండి అందజేశారు. పెనుమాకకు చెందిన పఠాన్ నాగుల్‌మీరాకు రిక్షాబండి, దాసరి కోటేశ్వరరావు, నెమలికంటి సూరికి తోపుడు బండ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి, భవనం రవీంద్రారెడ్డి, మేకా అంజిరెడ్డి, బొక్కా ప్రసన్న కుమార్(నాని), ఎస్‌కె బషీర్, ఎ.సుబ్బారావు, మేకా ప్రభాకర్‌రెడ్డి, భుజంగరావు, మురళి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర సలహాదారు డాక్టర్ జయప్రకాష్ సాయి



పర్యావరణ ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర సలహాదారు డాక్టర్ జయప్రకాష్‌సాయి, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న ఈమని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం వైద్య ఆరోగ్య, ఇంజనీరింగ్ సిబ్బంది

మంగళగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర సలహాదారు డాక్టర్ జయప్రకాష్ సాయి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఏకో పార్క్ ముఖద్వారం వద్ద ప్లాస్టిక్ కాలుష్య రహిత ప్రపంచం పట్ల నిబద్ధత, రాబోయే తరాలకు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ ప్రతిజ్ఞ చేసి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర సలహాదారు డాక్టర్ జె జయప్రకాష్ సాయి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తొలుత మనలోనే మార్పు రావాలని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు పాఠశాల స్థాయిలో పర్యావరణ, పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతే మనకు దైవం వంటిదన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ఏడాది నినాదమైన ప్లాస్టిక్‌ను నిరోదిద్దాం... అందుకు అందరూ తమ వంతు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అటవీశాఖ డిప్యూటీ రేంజర్ పి గిరిబాబు తన సొంత ఖర్చులతో ఏకో పార్కులోని సిబ్బందికి వాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు త్రిపురమల్లు సతీష్, అందె మురళి, గాజుల శ్రీనివాసరావు, సీబీడీ డీఎస్పీ శివారెడ్డి, లంకా శివరామ్‌ప్రసాద్, పి నిరంజన్‌గుప్తా, ఆర్ ధనలక్ష్మి, వీసం వెంకటప్రసాద్, జె భిక్షారావు, పెద్దిరాజు, అంకం అరుణ్‌కుమార్, వివేక్, కాపరౌతు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా ఫార్మసీ కళాశాలలో...

నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కనగల నిర్మలా ఫార్మసీ కళాశాలలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి రేకా నరేష్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ రెహ్మాన్, కరస్పాండెంట్ జి నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించామని వివరించారు. పచ్చదనం కోసం మేక్ ఎ గార్డెన్, కిచెన్ గార్డెన్, హ్యాంగింగ్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం, నో ప్లాస్టిక్, వేస్ట్ రీసైక్లింగ్, బిల్డ్ ఎకో ఫ్రెండ్లీ బర్డ్ ఫీడర్ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ఎన్విరాన్‌మెంట్ ప్రతిజ్ఞ చేయించారు. పాటలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరి సతీష్, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరులో....

నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గద్దె విజయకుమారి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చెట్లను నరకవద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటాలని కోరారు. అనంతరం గ్రామంలో పర్యావరణ దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రసన్న, చంద్రకళ, విశ్వాస్ కుమారి, గ్రామ పెద్దలు వెలువల సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయపూడి(తాడికొండ): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడుపై ఉందని రాయపూడి ఎంపీపీ పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయుడు వల్లభాపురం ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో వైద్య ఆరోగ్య, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకం తప్పనిసరి అని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవడం ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అవసరమైన వాయు కాలుష్యాన్ని, భూతాపాన్ని తగ్గించవచ్చన్నారు. ఆరోగ్య సిబ్బంది జి.వసంతరాజేశ్వరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నివారించాలని, ప్లాస్టిక్ వస్తువులలో తినడం కారణంగా రకరకాల క్యాన్సర్లు, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తున్నాయి కనుక వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల గ్రామంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. పురుగు మందుల తయారీ సంస్థ ఎఫ్ఎంసీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం గ్రామంలో పలు ప్రాంతాల్లో మొక్కలు స్వచ్ఛందంగా నాటారు. కార్యక్రమంలో ఏరియా మార్కెటింగ్ మేనేజర్ బి.శ్రీకర్, ఏరియా సేల్స్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో అతిసార నియంత్రణ పక్షోత్సవాలు



అవగాహన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లను అందజేస్తున్న డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్

తాడేపల్లిరూరల్: ఎండలు అతి తీవ్రంగా ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నుంచి ఈ కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో చిన్నపిల్లలో అతిగా విరేచనాలు అవుతాయని, దీని వల్ల శరీరంలో వాటర్ శాతం తగ్గి నీరసం వస్తుందని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తోందని, ప్రతి ప్రాంతంలో ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందజేస్తున్నామని, ఓఆర్ఎస్ ప్యాకెట్ ఒక లీటరు నీటిలో కలిపి పిల్లల వయసును బట్టి ఆ నీటిని తాగించాలని, ప్రతి ఒక్కరిని పరీక్షించి ఎంత ఓఆర్ఎస్ వాటర్ ఇవ్వాలో తల్లిదండ్రులకు వివరిస్తున్నామని, విరేచనాలు తగ్గడానికి జింక్ టాబ్లెట్లు కూడా అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: మండల పరిధిలోని మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం అతిసార నియంత్రణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎస్.శ్రీధర్ చంద్ తెలిపారు. అతిసార ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తాగునీరు, ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అతిసారపై అవగాహన కల్పించి జింక్ బిళ్లలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో మందపాడు వైద్యాధికారి డాక్టర్ పద్మలత, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ సిబ్బంది, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను గుర్తించే పనిలో అధికారులు

- అనర్హులకు ఫోన్లు చేస్తున్న సిబ్బంది
- పట్టాలు వెనక్కు ఇవ్వాలని ఆదేశాలు



ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టా

మంగళగిరి: ఆస్తి ఉన్నా లేనట్లుగా చూపి ప్రభుత్వ స్థలాలు పొందిన పలువురు అనర్హులను అధికారులు గుర్తిస్తున్నారు. నగర పరిధి యర్రబాలెంకు చెందిన ఓ మహిళ తాను ప్రభుత్వ స్థలం తీసుకునేందుకు అనర్హురాలిని అంటూ తీసుకున్న పట్టా రెవెన్యూ అధికారులకు వెనక్కి ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి అధికారులు ఇళ్ల పట్టాల లబ్ధిదారుల రీ వెరిఫికేషన్ చేపట్టారు. వలంటీర్లు, సచివాలయ అధికారులు, సిబ్బంది లబ్ధిదారుల గురించి పూర్తిస్థాయిలో విచారించి పట్టా పొందిన వారి ఇంట్లో ఎవరి పేరిట ఆస్తి ఉందో గుర్తించి పట్టా పొందిన వారికి ఫోన్ చేసి మీరు ప్రభుత్వ స్థలం తీసుకునేందుకు అనర్హులని, కేటాయించిన స్థలం రద్దు చేయడం జరుగుతుందని, తీసుకున్న పట్టాను అప్పగించాలని కోరుతున్నారు. తాజాగా యర్రబాలెంలో మున్నీ అనే వలంటీర్ మునగాల పరమేశ్వరి అనే లబ్ధిదారురాలికి ఆస్తి ఉందని గుర్తించి ఇటీవల తీసుకున్న ఇంటి పట్టాను వెనుక్కి తిరిగి ఇవ్వాలని ఫోన్ చేశారు. పలువురు వలంటీర్లు అనర్హులను గుర్తించి వారి పట్టాలను సరెండర్ చేయాలని కోరినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇళ్ల పట్టాల మంజూరుపై క్షుణ్ణంగా పరిశీలించి అనర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టారు.

అనర్హులైతే రద్దు చేస్తాం

జీవీ రామ్‌ప్రసాద్, తహసీల్దార్

ఇళ్ల పట్టాలు పొందిన అనర్హులను గుర్తించి రద్దు చేస్తాం. తప్పనిసరిగా అనర్హులను గుర్తిస్తాం, ప్రభుత్వ నిబంధనలు, సాంకేతికతను అడ్డుపెట్టుకుని కొందరు అనర్హులు పట్టాలు పొందినట్లు తేలింది. ఇళ్లు కట్టే సమయంలోనైనా ప్రభుత్వ సబ్సిడీ రుణం పొందేటప్పుడు అనర్హులు బయటపడతారు. అప్పుడైనా పట్టాను రద్దు చేస్తాం. అనర్హులు ఉంటే వెంటనే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పట్టాను సరెండర్ చేసి అధికారులకు సహకరించాలి.

బాబును ప్రజలు నమ్మరు

రాజధాని తుళ్లూరులో నిన్ను నమ్మం బాబు ర్యాలీ

తాడికొండ: మేనిఫెస్టో పేరుతో మరోసారి ప్రజలను మోసం చేయాలనుకుంటున్న బాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు శృంగారపాటి సందీప్ అన్నారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరులో సోమవారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు నిన్ను నమ్మం బాబు పేరుతో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం కూడలి నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సందీప్ మాట్లాడుతూ 2014లో మేనిఫెస్టో పేరుతో 600 అబద్ధపు హామీలిచ్చిన చంద్రబాబు ఒక్క హామీని అమలు చేయకపోగా అసలు మేనిఫెస్టోనే టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనుడు అన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనే మనసులో లేని చంద్రబాబు అసలు సంక్షేమ పథకాలపై ఓ అవగాహన లేకుండా కర్ణాటకలో కాంగ్రెస్ హామీలు, ఏపీలో జగనన్న అమలు చేస్తున్న పథకాలను పేర్లు మార్చి తాను ఇస్తానని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. బాబు ఎన్ని దొంగ హామీలిచ్చినా రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ప్రస్తుతం జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని బాబు దొంగ హామీలు నమ్మి మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చలివేంద్రం సురేష్, నేలపాటి నాగేంద్ర, తుమ్మూరు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ట్రోఫీ గెల్చుకున్న బాప్టిస్ట్ వారియర్స్ జట్టు



ట్రోఫీతో బాప్టిస్ట్ వారియర్స్ జట్టు

మంగళగిరి: నగరంలోని బాప్టిస్టుపేటలో ఆరు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. బాప్టిస్ట్ యూత్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాప్టిస్ట్ యూత్ స్థానిక దాతల సహకారంతో టోర్నమెంట్ నిర్వహించగా ఆరు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు బాప్టిస్ట్ వారియర్స్ జట్టు, బాప్టిస్ట్ రాయల్స్ జట్టు చేరుకోగా ఆదివారం ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాయల్స్ జట్టు 5 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వారియర్స్ జట్టు 4 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. అతిథులు వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందజేసి టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్న జట్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టీఎస్ఆర్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఉన్న కేసీడబ్ల్యూ ఈఈఎస్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు(1985-86, 2003-04) ఆత్మీయ కలయిక సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాథమిక ఉన్నత పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, సూరిబాబు, అన్నపూర్ణ, ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టీఎస్ఆర్ విచ్చేశారు. టీఎస్ఆర్ మాట్లాడుతూ కేసీడబ్ల్యూ ఈఈఎస్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని, పూర్వ విద్యార్థుల్లో చాలామంది వివిధ వృత్తులలో పనిచేస్తూ కుటుంబ సభ్యులతో సహా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 35 సంవత్సరాల తరువాత తమకు విద్య నేర్పిన గురువులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, వారిని సత్కరించడం మరుపురాని సంఘటన అని అన్నారు. పూర్వ విద్యార్థులంతా కలసి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములం అవుతామని అన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టీఎస్ఆర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సలీం, మునీర్, హరిప్రసాద్, రాజశేఖర్, రాజ్యలక్ష్మి, ఉమా గౌరి, 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నాగరాజు, ప్రేమ్‌సాగర్, పరబ్రహ్మేశ్వరరావు, జాన్‌వెస్లీ, ఏడుకొండలు, కిరణ్, ప్రసాద్, సరిత, రేఖ, మహేశ్వరి, నాయక్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత వల్లభనేనికి ఎమ్మెల్యే నివాళి



సీపీఎం నాయకుడు వల్లభనేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: సీపీఎం నాయకులు వల్లభనేని సాంబశివరావుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నివాళులర్పించారు. వల్లభనేని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. తుమ్మపూడిలో సోమవారం జరిగిన వల్లభనేని సంస్మరణ సభలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సాంబశివరావు చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రజా సమస్యలపై పోరాడిన సాంబశివరావు మృతి చెందడం సీపీఎంకి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

తుమ్మపూడి మాజీ సర్పంచ్ త్రిమూర్తి మృతి

తుమ్మపూడి మాజీ సర్పంచ్ బిరుదుగడ్డ త్రిమూర్తి సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వారి నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీరయ్య, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా దీవెన కిట్లు పాఠశాలలకు అందజేత



తాడేపల్లిరూరల్: జగనన్న విద్యా దీవెన కింద అందజేసే కిట్లను సోమవారం మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. దుగ్గిరాల బాయిస్ హాస్టల్‌లో ఉన్న స్టాక్ పాయింట్ నుంచి వివిధ పాఠశాలలకు తరలించారు. ఎంఈఓ కాజా శ్రీనివాసరావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, నోటు, పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశామని అన్నారు. మరో రెండు రోజుల్లో బూట్లు, బెల్టులు కూడా వస్తాయని వాటిని కూడా ఈనెల 12వ తేదీ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ జాతీయ ఉపాధ్యక్షుడిగా బ్రహ్మారెడ్డి



ఆటోనగర్(విజయవాడతూర్పు): జాతీయ పౌర-పర్యావరణ పరిరక్షణ జాతీయ ఉపాధ్యక్షుడిగా విజయవాడ పటమటలో నివాసం ఉంటున్న కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి సోమవారం ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా నిడమర్రుకు చెందిన ఈయన ప్రస్తుతం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా సోమవారం న్యూఢిల్లీలోని రాజ్యాంగ క్లబ్ వేదికగా నిర్వహించిన ప్రత్యేక సదస్సులో బ్రహ్మానందరెడ్డికి నియామక పత్రాన్ని నేషనల్ సివిల్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఇంటర్నేషనల్ ఎన్జీ జాతీయ అధ్యక్షుడు విజయరాజ్ ధమాల్, జాతీయ, పౌర పర్యావరణ పరిరక్షణ జాతీయ ప్రధాన కార్యదర్శి మదన్‌పాటిల్ చేతుల మీదుగా అందించినట్టు బ్రహ్మానందరెడ్డి చెప్పారు. అనంతరం జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతు కావేరి నది తరహాలో కృష్ణానదిని శుద్ధి చేసి మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రమంత్రి రాందాస్ అధవాలేను బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెప్పారు.

పర్యావరణంపై రైతులకు అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామంలో సోమవారం పర్యావరణంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ ఉపసంచాలకులు రామాంజనేయులు మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన గాలి, నీరు, పోషక విలువలతో కూడిన ఆహారం అవసరమని చెప్పారు. విషపదార్థాలు లేని ఆహారాన్ని పండించే గురుతర బాధ్యత రైతులపైన ఉందని తెలిపారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయశాస్త్రవేత్తలు సూచించిన విధంగానే ఎరువులు వాడుకోవాలని చెప్పారు. పంటలు పండించే ముందు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని సూచించారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి వంటి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని, అందుకనే 2023 వసంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం 30రకముల విత్తనాలు, పీఎండీఎస్ పచ్చిరొట్ట కిట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, జిల్లావనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రాజవంశీ, ఏవో రమణకుమార్, వ్యవసాయ విస్తరణాధికారి సుభాని, జానీబాష, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఖాతాలో నగదు మాయం

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో నివాసముండే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌కు చెందిన ఎస్‌కె బాజీబాబా చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సెలవు పెట్టి స్వగ్రామమైన ప్రకాష్‌నగర్ వచ్చాడు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడుతుండగానే మీ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వచ్చిందని, ఆ నెంబర్ చెప్పమని అడగడంతో బాజీబాబా ఓటీపీ నెంబర్ చెప్పాడడు. వెంటనే అతని ఖాతాలో ఉన్న రూ.1,23,000 విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో తిరిగి తనకు వచ్చిన నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ చెప్పారు.

చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలి

తాడికొండ: చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అని తాడికొండ శాఖ గ్రంధాలయాధికారి జి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం గ్రంథాలయాల సంస్థ ద్వారా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఈ నెల 11 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వివిధ రకాల శిక్షణ అందిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథల పుస్తకాలు, క్యారమ్స్, చెస్ వంటి ఆటలలో ప్రావీణ్యం ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నట్లు ఆయన తెలిపారు.